క్లుప్తంగా

నేటి నుంచి శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు

కడియం: దుళ్ల గ్రామంలోని భూ సమేత వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి ఈ నెల 12వ తేదీ వరకూ జరగనున్నాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చక స్వామి పెద్దింటి లక్ష్మణాచార్యులు తెలిపారు. గురువారం గోవింద మాలధారణతో ప్రారంభమయ్యే బ్రహ్మోత్సవాలు, శేష వాహన సేవ, 8వ తేదీన శ్రీవారి కల్యాణం, గరుడ వాహన సేవ, రథోత్సవం, 9వ తేదీన సుదర్శన హోమం, హంస వాహన సేవ, 10వ తేదీన అన్నకూటోత్సవం, సదస్యం, 11వ తేదీన లక్ష్మీ హోమం, హనుమంత వాహన సేవ, 12వ తేదీన చక్రస్నానం, పుష్పయాగం జరుగుతాయన్నారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద శ్రీవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు, సామూహిక విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణ, భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌కు సత్కారం



డాక్టర్ శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న బిక్కవోలు ఎంపీపీ బుద్దాల కన్నారావు

రాజమహేంద్రవరం సిటీ: వైఎస్సార్ సీపీ పార్లమెంటు నియోజకవర్గం ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను రాజామహేంద్రవరంలో బుధవారం బిక్కవోలు ఎంపీపీ బుద్దాల కన్నారావు, వైఎస్సార్ సీపీ నాయకుడు కేత ప్రసాద్ కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి, బిక్కవోలు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి చిత్రపటాన్ని అందజేశారు. వారి వెంట జెడ్పీటీసీ పేపకాయల రాంబాబు తదితరులు ఉన్నారు.

ప్రజాస్వామ్యానికి కూటమి ప్రభుత్వం తూట్లు



మాసా రామజోగ్

రాజమహేంద్రవరం సిటీ: ఏపీలో ప్రజాస్వామ్యానికి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాసిన భారత రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ కూటమి ప్రభుత్వం దారుణాలకు పాల్పడుతోందని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మాసా రామ్ జోగ్ అన్నారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. తిరుపతిలో డిప్యూటీ మేయర్ పదవి కోసం కూటమి ప్రభుత్వం మంగళవారం చేసిన దౌర్జన్యకాండ దీనికి నిదర్శమన్నారు. వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు వెళుతున్న బస్సును ఆపి, దానిలోని కార్పొరేటర్లను రోడ్డు మీదకు ఈడ్చి, బస్సు అద్దాలను పగలగొట్టి మారణ హోమాన్ని సృష్టించడం కిరాతక చర్యగా అన్నారు. దీనిపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నోరు విప్పక పోవడం దారుణమన్నారు.

కార్మిక సంఘాల నిరసన



నిరసన తెలుపుతున్న కార్మిక సంఘాలు

ప్రకాశం నగర్: కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను ఉపసంహరించాలని , పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టిన బడ్జెట్‌కు నిరసనంగా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బుధవారం స్థానిక శ్యామల సెంటర్ వద్ద నిరసన జరిగింది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు టి.అరుణ్, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యాక్షుడు టి.మధు, ఐఎఫ్‌టీయూ నాయకుడు డి.శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దుచేసి, 4 లేబర్ కోడ్స్ ను తీసుకురావడం సరికాదన్నారు.

ఈ వృద్ధుడి ఆచూకీ తెలుసా..



స్వర్ణాంధ్ర ఆశ్రమంలో వృద్ధుడు

రాజమహేంద్రవరం సిటీ: తనను కుటుంబ సభ్యుల వద్దకు చేర్చాలంటూ సెంట్రల్ జైలు వద్ద సుమారు 70 ఏళ్ల వ్యక్తి బోరున విలపిస్తున్నాడు. విషయం తెలుసుకున్న వన్ టౌన్ పోలీసులు అతడిని లాలాచెరువులోని స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమానికి అప్పగించారు. వివరాల్లోకి వెళితే.. పెరవలి మండలం ఉసురుమర్రికి చెందిన శివకోటి అచ్యుత సుందర సూర్యనారాయణ పౌరోహిత్యం చేసేవాడు. అతడికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమారుడు కాకినాడలో ఉంటున్నట్లుగా చెబుతున్నాడు. ఏదో ప్రయాణం పేరుమీద రాజమహేంద్రవరం తీసుకొచ్చారని, వారి నుంచి తాను తప్పిపోయానని చెప్పడంతో పోలీసులు స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమానికి చేర్చారు. ఆయన కుటుంబ సభ్యులు తమను సంప్రదించాలని స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమ నిర్వాహకులు డాక్టర్ గుబ్బల రాంబాబు తెలిపారు.

హరిత నిర్లక్ష్యం



మోడల్ కాలనీ రోడ్డులో కుండీలు, మొక్కల పరిస్థితి

- పచ్చదనానికి నిర్లక్ష్యపు గ్రహణం
- కనుమరుగవుతున్న మొక్కలు
- బోసిపోతున్న డివైడర్లు

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరాన్ని సుందర నగరంగా తీర్చిదిద్దామంటూ అధికారులు చేస్తున్న ప్రకటనలు హాస్యాస్పదంగా మారుతున్నాయి. క్షేత్రస్థాయిలో జరుగుతున్న నిర్లక్ష్యంతో లక్షల రూపాయలు వృథాగా మారుతున్నారు. నగరంలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు రోడ్ల మధ్యలో డివైడర్లు కట్టి, వాటిలో మొక్కలు వేశారు. వాటి కారణంగా నగరం సుందరంగా మారింది. కానీ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో అవన్నీ చనిపోతున్నాయి.

డివైడర్ల ఏర్పాటు

నగరంలో 50 డివిజన్ల పరిధిలో 29 కిలోమీటర్ల మేర డివైడర్లను ఏర్పాటు చేశారు. సుందరీకరణ పేరుతో వాటిలో లక్షలాది రూపాయల వ్యయంతో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగానే అప్పటి ఎంపీ మార్గాని భరత్ రామ్.. యువత హరిత, జగనన్న హరిత నగరాలు పేరుతో డివైడర్లను సుందరంగా తీర్చిదిద్దారు. లక్షలాది రూపాయలు ఖర్చు చేసి మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మొక్కలను నగరంలో వివిధ కళాశాలలు చెందిన విద్యార్థులకు దత్తత ఇచ్చారు. విద్యార్థులు నాటిన మొక్కలకు వారి పేర్లపై బోర్డులను సైతం ఏర్పాటు చేశారు. కాలక్రమేణా పాలన మారింది. మొక్కలను శ్రద్ధగా పెంచాల్సిన నగరపాలక సంస్థ అధికారులు నిర్లక్ష్యం వహించారు. దీంతో డివైడర్లలో వేసిన మొక్కలలో అధిక శాతం పూర్తిగా దెబ్బతిన్నాయి. ఉన్న మొక్కల మధ్య పిచ్చితుప్పలు పెరిగిపోయాయి.

ధ్వంసమైన మొక్కలు

స్థానిక పదో డివిజన్ మోడల్ కాలనీలో వీఎల్ పురం నుంచి జాతీయ రహదారికి వెళ్లే మార్గంలో డివైడర్లపై లక్షల రూపాయలతో మొక్కలను ఏర్పాటు చేశారు. సెంటర్ డివైడర్‌పై ఈ మొక్కలను ఏర్పాటు చేస్తూ సుమారు 100 కుండీలను పెట్టారు. వాటిని ఏమాత్రం పట్టించుకోకపోవడంతో పూర్తిగా మొక్కలు ధ్వంసం అయ్యాయి. కొన్నిచోట్ల కుండీలు సైతం దెబ్బతిన్నాయి. నగరంలో ఉన్న డివైడర్ల మొక్కలకు సరైన నిర్వహణ లేకపోవడంతో చిందరవందరగా తయారయ్యాయి.

నీరు లేక..

ఆజాద్ చౌక్ నుంచి నందం గనిరాజు జంక్షన్ వరకూ డివైడర్లపై గ్రీన్ గ్రాస్ ఏర్పాటు చేశారు. దానికి సకాలంలో నీరు అందించకపోవడంతో పూర్తిగా దెబ్బతింది. ప్రతిష్టాత్మకమైన పరమహంస యోగానంద మార్గంలో సరైన నిర్వహణ లేకపోవడంతో డివైడర్లలో చెత్తను, వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. నగరంలోని మిగిలిన ప్రాంతాల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది.

బిల్లులు చెల్లించక..

రాజమహేంద్రవరాన్ని స్వచ్ఛ నగరంగా, సుందర నగరంగా తీర్చిదిద్దుతామంటూ ప్రకటన చేస్తున్న అధికారులు.. ఉన్న పచ్చదనాన్ని కాపాడే ప్రయత్నాలు చేయకపోవడం హాస్యాస్పదంగా ఉందంటూ నగర పౌరులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి, డివైడర్లపై పచ్చదనాన్ని కాపాడేందుకు ప్రయత్నాలు చేయాలని కోరుతున్నారు. ఈ డివైడర్లపై మొక్కలను సంరక్షించాల్సిన బాధ్యత నగరపాలక సంస్థ ఉద్యానవన శాఖ అధికారులకు ఉన్నప్పటికీ, వీటిలో కొన్ని డివైడర్లను కాంట్రాక్టు పద్ధతిపై వేరొకరికి అప్పగించారు. అయితే నిర్ణీత సమయానికి కాంట్రాక్టర్‌కు బిల్లుల సొమ్ములు చెల్లించకపోవడంతో ఆ కాంట్రాక్టర్ డివైడర్ల పర్యవేక్షణ వదిలేసినట్లు సమాచారం. ఈ విషయంపై నగర పాలక సంస్థ ఉద్యానవన శాఖ అధికారి స్వాతిని వివరణ కోరగా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించేందుకు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.



మొక్కలు చనిపోవడంతో బోసిపోయిన డివైడర్



ఆజాద్ చౌక్ సెంటర్‌లో దెబ్బతిన్న గ్రీన్ గ్రాస్, మొక్కలు



పరమహంసం యోగానంద మార్గ్‌లోని డివైడర్‌లో మొక్కలు

పర్యవేక్షణా లోపం



డివైడర్లపై మొక్కలను పర్యవేక్షించేందుకు అధికారులు శ్రద్ధ చూపడం లేదు. మొక్కలు దెబ్బతింటే వాటి స్థానంలో కొత్త వాటిని నాటాలి. కానీ వాటిని అలాగే వదిలేస్తున్నారు. అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండడంతో డివైడర్లపై మొక్కలు పూర్తిస్థాయిలో దెబ్బతింటున్నాయి.

– జగదీష్, రాజమహేంద్రవరం

ఇష్టారాజ్యం



నగరపాలక సంస్థకు పాలక మండలి లేకపోవడంతో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. డివైడర్లపై మొక్కలను కాపాడడంలో సంబంధిత శాఖ అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. ఇప్పటికైనా నగరపాలక సంస్థ కమిషనర్ ప్రత్యేక దృష్టి సారించి నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దాల్సి ఉంది.

– గుడిమెట్ల వెంకటరెడ్డి (బాలాజీరెడ్డి), రాజమహేంద్రవరం

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాలకు అధ్యక్షుల నియామకం

రాజమహేంద్రవరం రూరల్: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమించారు. ఈ మేరకు కేంద్ర పార్టీ కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. ఆ ప్రకారం.. యువజన విభాగానికి కొత్తపల్లి శివాజీ, మహిళా విభాగానికి అంగాడ సత్యప్రియ, రైతు విభాగానికి కొత్తపల్లి వెంకట కేశవ రామారావు, బీసీ సెల్‌కు టేకి శ్రీనివాసరావు, ఎస్సీ సెల్‌కు చీకరమిల్లి చిన్న వెంకటరావు (చిన్న), ఎస్టీ సెల్‌కు గాడా తాతారావు, మైనార్టీ సెల్‌కు షేక్ చానా, క్రిస్టియన్ మైనార్టీ సెల్‌కు కరుకు ఇమ్మానియేలు, విద్యార్థి విభాగానికి పట్టా ఉత్తేజ్, పంచాయతీ రాజ్‌కు చెరుకూరి సత్యనారాయణ, ఆర్‌టీఐకి పడాల వీర రాఘవరెడ్డి, వలంటీర్‌కు కాగిత అశోక్ నియమితులయ్యారు.

- గ్రీవెన్స్ విభాగానికి బత్తిన అప్పారావు, వాణిజ్య విభాగానికి సాపిరెడ్డి సూరిబాబు, వీవర్స్‌కు కొండపల్లి పట్టియ్య, వైఎస్సార్‌టీయూసీకి కోటిపల్లి రవీంద్ర (రవి), అంగన్‌వాడీ విభాగానికి కొరిమిశెట్టి ధనలక్ష్మి, లీగల్ సెల్‌కు చింతపర్తి రాంబాబు, కల్చరల్‌కు కాపు భావన్నారాయణ, ఐటీ వింగ్‌కు అరిగెల హరీష్, దివ్యాంగుల విభాగానికి గుత్తుల వీర వెంకట రమణ (జీవీఆర్ రాజా), డాక్టర్స్ విభాగానికి షేక్ ఇమామ్ (బాబ్జీ), పబ్లిసిటీ వింగ్‌కు ఆచంట కళ్యాణరావు, ఇంటిలెక్చువల్ ఫోరమ్‌కు బోడపాటి కుమార్, బూత్ కమిటీల విభాగానికి తాటికొండ విష్ణుమూర్తిని నియమించారు.

ఇంటి పన్నులు నూరు శాతం వసూలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నగర పాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం రూరల్: గ్రామ పంచాయతీలలో ఇంటి పన్నులను నూరుశాతం వసూలు చేయాలని పంచాయతీ కార్యదర్శులకు నగర పాలక సంస్థ కమిషనర్, గ్రామ పంచాయతీల ప్రత్యేకాధికారి కేతన్ గార్గ్ ఆదేశించారు. హుకుంపేటలోని ఎంపీడీవో కార్యాలయంలో ఆయన ప్రత్యేకాధికారిగా ఉన్న 12 గ్రామ పంచాయతీల పాలనపై బుధవారం సాయంత్రం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూరల్ మండలంలో రూ.23 కోట్ల ఇంటి పన్ను పెండింగ్‌లో ఉందని, ఈ నెల 23వ తేదీలోగా 50 శాతం, మార్చి 31వ తేదీలోపు నూరు శాతం వసూలు చేయాలన్నారు. గ్రామాల్లో 20 అడుగుల రోడ్లకు బిల్డింగ్ ప్లాన్లు ఇవ్వద్దని, ప్రతి ప్లాన్‌కు 30 అడుగుల రోడ్డు కచ్చితంగా ఉండాలని ఆదేశించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకు రావాలన్నారు. తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించి తయారీ కేంద్రంలోనే ప్లాస్టిక్‌ను వేరుచేసి అక్కడే విక్రయించాలని, వచ్చిన సొమ్ములో 70 శాతం పంచాయతీకి, 30 శాతం పనిచేసిన వారికి ఇవ్వాలన్నారు. గ్రామాలలో పారిశుధ్య వ్యవస్థను మెరుగుపరచాలని, డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని ఆదేశించారు. ఎంపీడీవోలు డి.శ్రీనివాసరావు, కె.రమేష్, ఝాన్సీ, ఈవోపీఆర్అండ్ఆర్డీ ఆర్మ్‌స్ట్రాంగ్, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి సమష్టి కృషి

- కష్టపడి పని చేసిన వారికి గుర్తింపు
- జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి వేణు



వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణును సత్కరిస్తున్న అనుబంధ విభాగాల జిల్లా అధ్యక్షులు

రాజమహేంద్రవరం రూరల్: వైఎస్సార్ సీపీ బలోపేతానికి అంకితభావంతో పనిచేయాలని జిల్లా అనుబంధ విభాగ అధ్యక్షులకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ సూచించారు. రాజానగరం నియోజకవర్గానికి చెందిన జిల్లా బీసీ సెల్ విభాగం అధ్యక్షుడు కొండపల్లి దుర్గారావు, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు అడబాల చిన్నబాబు, సోషల్ మీడియా ఇన్‌చార్జి వల్లభశెట్టి వీర వెంకట సత్యనారాయణ తదితరులు బుధవారం బొమ్మూరులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మాజీ మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టపడి పనిచేసిన వారికి పార్టీలో సరైన గుర్తింపు ఉంటుందన్నారు. పదవులు పొందిన ప్రతి ఒక్కరూ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో నిత్యం మమేకవుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు వాసంశెట్టి పెద్ద వెంకన్న, కర్రి నాగేశ్వరరావు, కోరుకొండ మండల కోకన్వీనర్ గణేశుల పోశారావు తదితరులు పాల్గొన్నారు.

దారి కాచి రూ.4 వేలు, సెల్‌ఫోన్ చోరీ

రాజమహేంద్రవరం రూరల్: ఒడిశాకు చెందిన ఎస్‌కే షకీలుద్దీన్ దివాన్ చెరువు జీరోపాయింట్ వద్ద ఫ్రెండ్స్‌డాబాలో సప్లయర్‌గా పనిచేస్తున్నాడు. సమీపంలోనే రూమ్ తీసుకుని ఉంటున్నాడు. ఈ నెల 2వతేదీ అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో విధులు ముగించుకుని ఇంటికి నడుచుకుని వెళుతున్నాడు. ఎస్‌వీపీసీ ఫంక్షన్ హాలు వద్దకు వచ్చేసరికి ఐదుగురు రెండుబైక్‌లపై వచ్చి అడ్డగించారు. అతడి నుంచి రూ.4 వేలు,సెల్‌ఫోన్ లాక్కుని వెళ్లిపోయారు. షకీలుద్దీన్ ఫిర్యాదు మేరకు బొమ్మూరు ఎస్సై అంకారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా తిరువీధి మహోత్సవం



నృసింహస్వామి తిరువీధి ఉత్సవం

రాజమహేంద్రవరం సిటీ: కోరుకొండ రోడ్డులోని సింహాచల నగర్‌లో గల వరాహలక్ష్మీ నృసింహ స్వామి క్షేత్రంలో చందనయాత్ర మహోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకుడు కిరణ్ స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధ్వజారోహణ, యాగశాల ప్రవేశం , చతుస్థాన అర్చనలు, నిత్యం హోమాలు, నిత్య పూర్ణాహుతి నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు కాలెపు సింహాచలం, కాలెపు నాగేశ్వరరావు పర్యవేక్షణలో తిరువీధి (గరుడసేవ) ఉత్సవాన్ని పుర వీధుల్లో వైభవంగా జరిపారు. ఆలయం నుంచి ప్రారంభమైన ఈ తిరువీధి ఉత్సవం రాజా థియేటర్, కంబాల చెరువు, దేవీచౌక్, కోటగుమ్మం, మెయిన్ రోడ్డు, డీలక్స్ సెంటర్ మీదుగా కొనసాగింది. మేళతాళాలు, బాజా భజంత్రీలు, కోలాటం, వేషధారణలు, కలశాలలో మహిళల ఊరేగింపు ఆకట్టుకున్నాయి.

కళలు, కళాకారులను బతికించుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న గజల్ శ్రీనివాస్

ప్రకాశం నగర్: మన సంస్కృతీ సంప్రదాయాలు పది కాలాల పాటు కొనసాగాలంటే మన కళలను, కళాకారులను గౌరవించుకోవాలని మాస్ట్రో డాక్టర్ గజల్ శ్రీనివాస్ అన్నారు. ప్రకాశం నగరంలోని ధర్మంచర కమ్యూనిటీ హాల్లో బుధవారం గోదావరి ఉత్సవ్ కార్యక్రమం నిర్వహించారు. ఫిలాంత్రోఫిక్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అంతర్జాతీయ శ్రీ శ్రీ కళావేదిక సీఈవో కత్తిమండ ప్రతాప్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ కళలకు కాణాచి, చరిత్రాత్మక రాజమహేంద్రవరంలో ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. నిర్వాహకుడు అద్దంకి రాజాయోనాను ఆయన అభినందించారు. గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపి మూర్తి మాట్లాడుతూ అంతరించి పోతున్న మన కళలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలు, ప్రభుత్వాలపై ఉందన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నర్సిపల్లి హారిక మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో మన కళలకు ఎంతో పేరు ఉందన్నారు. శ్రీశ్రీ కళావేదిక వ్యవస్థాపకుడు కత్తిమండ ప్రతాప్ మాట్లాడుతూ చారిత్రాత్మక రాజమహేంద్రవరాన్ని ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక రాజధానిగా ప్రకటించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అనంతరం విభిన్న రంగాల్లో ప్రతిభావంతులకు తెలుగు తేజం పురస్కారాలు అందజేశారు.

ప్రజల పక్షాన వైఎస్సార్ సీపీ పోరాటం



డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను కలిసిన జిల్లా అనుబంధ సంఘాల అధ్యక్షులు

రాజమహేంద్రవరం సిటీ: ప్రజల పక్షాల వైఎస్సార్ సీపీ నిరంతరం పోరాటం చేస్తోందని పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. దివాన్ చెరువు విజయభారతి చెస్ట్ ఇనిస్టిట్యూట్ వద్ద బుధవారం ఆయనను రాజానగరం నియోజక వర్గానికి చెందిన బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొండపల్లి దుర్గారావు, సోషల్ మీడియా వింగ్ జిల్లా అధ్యక్షుడు వల్లభశెట్టి వెంకట సత్యనారాయణ, పబ్లిసిటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు అడబాల వీర సత్యనారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు. జెడ్పీటీసీలు వాసంశెట్టి పెద్ద వెంకన్న, కర్రి నాగేశ్వరరావు, సర్పంచ్‌లు మరుకుర్తి వెంకటేశ్వరరావు, అరవాలు తదితరులు ఉన్నారు.

హ్యాండ్ బాల్ పోటీల్లో విద్యార్థుల సత్తా

ప్రకాశం నగర్: నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలో ఇటీవల జరిగిన పురుషుల అంతర్ కాలేజీ ఎట్ హ్యాండ్ బాల్ (చేతి బంతి) టోర్నమెంట్‌లో ఎస్‌కేవీటీ ప్రభుత్వ కళాశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచి ట్రోఫీని సాధించారు. ఈ విషయాన్ని ఆ కళాశాల ప్రిన్సిపాల్ డీవీ రమణమూర్తి బుధవారం విలేకరులకు తెలిపారు. టోర్నీలో మొత్తం 12 జట్లు పాల్గొన్నాయని, తమ కళాశాల పురుషుల విభాగం జట్టు విజేతగా నిలిచిందన్నారు.

వృద్ధాప్య పింఛన్ల పంపిణీ

ప్రకాశం నగర్: వాకర్స్ యోగా అండ్ లాఫింగ్ క్లబ్ సేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాలలోని ఆనందా గార్డెన్స్‌లో అధ్యక్షుడు శనపతి సత్తిబాబు అధ్యక్షతన వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఒక్కొక్కరికి రూ.500 చొప్పున మొత్తం రూ.40 వేలను అందజేశారు. కార్యక్రమంలో దుబ్బిరెడ్డి వెంకట్రావు, అనసూరి శ్రీనివాస్, కాశీ విశ్వనాథం, బొల్లా పెద్ద సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

వ్యభిచార గృహంపై దాడి

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు వడ్డి వీరభద్ర నగర్‌లో వ్యభిచారం గృహంపై బొమ్మూరు ఇన్‌స్పెక్టర్ కాశీ విశ్వనాథ్‌కు రాబడిన సమాచారం మేరకు బుధవారం సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఈ సందర్భంగా గుబ్బల వెంకటలక్ష్మి, ఆమె భర్త సత్యనారాయణతో ఇద్దరు విటులను అరెస్టు చేశారు. ఒక బాధిత మహిళను విడిపించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కత్తితో పొడిచిన వ్యక్తికి ఏడాది జైలుశిక్ష

కడియం: కడియపులంకలో ఒక ఇంట్లో దొంగతనం చేసి పారిపోతూ అడ్డువచ్చిన వ్యక్తిని పొడిచిన కేసులో నేతల రాజేష్ వర్మ అలియాస్ రాజేష్‌కు ఏడాది జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి చావలి రమ్య తీర్పునిచ్చారు. 2020లో నేతల రాజేష్ కడియపులంక గ్రామంలో ఒక ఇంటిలో దొంగతనం చేశాడు. అక్కడి నుంచి పారిపోతూ అడ్డువచ్చిన వ్యక్తిని పొడిచాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై అమీనా బేగం కేసు నమోదు చేశారు. దర్యాప్తు అనంతరం నిందితుడిని అరెస్టు చేశారు. మూడో ఏజేఎఫ్‌సీఎం ప్రిన్సిపల్ జ్యువెనల్ జస్టిస్ బోర్డు కోర్టులో ప్రస్తుత ఇన్‌స్పెక్టర్ ఎ.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కోర్టు హెడ్‌కానిస్టేబుల్ రాజేంద్ర సకాలంలో కోర్టులో సాక్ష్యాలను ప్రవేశపెట్టారు. ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ సీహెచ్ రాజశేఖర్ వాదనలు వినిపించారు. రాజేష్ వర్మపై నేరం రుజువుకావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పునిచ్చారు.

ప్రారంభమైన ప్రాక్టికల్స్

కంబాలచెరువు: ఇంటర్మీడియట్ పబ్లిక్ ప్రాక్టికల్స్‌లో భాగంగా శుక్రవారం జిల్లాలోని 12 కేంద్రాల్లో ఒకేషనల్ ప్రాక్టికల్స్ ప్రారంభమైనట్టు ఇంటర్ జిల్లా ప్రాంతీయ పర్యవేక్షణాధికారి ఎన్ఎస్‌వీఎల్ నరసింహం తెలిపారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకూ ప్రథమ సంవత్సరం, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు నిర్వహించారన్నారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులు 819 మందికి 727 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 705 మందికి 665 మంది హాజరైనట్టు తెలిపారు. ఐపీఈ థియరీ పరీక్షలు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆధ్వర్యంలో నిర్వహించారు. 12 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు సజావుగా నిర్వహించినట్టు నరసింహం తెలిపారు.

చోరీ కేసులో ఒకరి అరెస్టు



నిందితుడు, రికవరీ చేసిన సొత్తుతో ఎస్సై నాగ దుర్గాప్రసాద్, సిబ్బంది

కడియం: చోరీ కేసులో ఒకరిని అరెస్టు చేసి, రెండు ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్, ప్రింటర్, మోటర్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై నాగ దుర్గాప్రసాద్ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. వెంకాయమ్మపేటలో హైవే పక్కన ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌లో షట్టర్‌ను గత నెల తొమ్మిదో తేదీన దొంగలు పగులకొట్టారు. దానిలోని ల్యాప్‌టాప్, కంప్యూటర్, కొంత నగదు చోరీ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సై నాగ దుర్గాప్రసాద్ కేసు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ నరసింహ కిశోర్ ఆదేశాల మేరకు సౌత్‌జోన్ డీఎస్పీ భవ్యకిషోర్ ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ ఎ.వెంకటేశ్వరరావు, ఎస్సై దుర్గాప్రసాద్ దర్యాప్తు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో మంగళవారం చోరీ చేసిన ముగ్గురిలో కృష్ణాజిల్లా చౌటుపల్లి గ్రామానికి చెందిన అల్లాడి నాగమణికంఠ ఈశ్వర్‌ను అరెస్టు చేశారు. అతడి నుంచి ల్యాప్‌టాప్, కంప్యూటర్, తణుకు పరిధిలో దొంగతనం చేసిన మోటార్ సైకిల్, కొత్తగూడెం పరిధిలో దొంగతనం చేసిన లాప్‌టాప్, ప్రింటర్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. మిగిలిన ఇద్దరిలో ఒకరిని టంగుటూరు పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు, మరొక వ్యక్తి పరారీలో ఉన్నట్లు ఎస్సై తెలిపారు.

అధునాతన వైద్యవిధానాలపై అవగాహన

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేటలోని గోదావరి రుచులు కాన్ఫరెన్స్ హాలులో బుధవారం పీఎంపీలకు నూతన వైద్య విధానాలపై అవగాహన సదస్సు జరిగింది. కమ్యూనిటీ పారామెడిక్స్–ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ది పీఎంపీ అసోసియేషన్) ఆధ్వర్యంలో రాజమండ్రి శాఖ అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్ ఖాన్ అధ్యక్షత వహించారు. శ్రీకర్ హాస్పిటల్‌కు చెందిన రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ వైద్య నిపుణులు రోహిత్ కుమార్ మాట్లాడుతూ అత్యాధునిక రోబో సర్జరీ ట్రీట్మెంట్ గురించి వివరించారు. జాతీయ ఉపాధ్యక్షుడు, రాష్ట్ర అధ్యక్షులు తోరాటి ప్రభాకరరావు , జిల్లా అధ్యక్షుడు బళ్లా శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి పి.దేవానందం, కోశాధికారి పి.చిన్ని, మండల కార్యదర్శి మట్టా రమేష్ పాల్గొన్నారు.